సాక్షి అనంతపురం

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



రిటైర్డ్ ఏఎస్ఐ ఇంట్లో చోరీ

ఏకంగా ఓ రిటైర్డ్ ఏఎస్ఐ ఇంట్లోనే దొంగలు చోరీ చేశారు. అనంతపురం రూరల్ మండలంలో ఘటన జరిగింది. 8లో



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.36 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జికి స్వాగతం



జస్టిస్ శ్రీనివాసరెడ్డికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టవర్‌క్లాక్: హైకోర్టు జడ్జి జస్టిస్ కె. శ్రీనివాస రెడ్డికి ఘన స్వాగతం లభించింది. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం జస్టిస్ శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శ్యాం సుందర్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో పత్తి కొనుగోలు



అనంతపురం అగ్రికల్చర్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు, ఏడీఎం బి.సత్యనారాయణచౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. పొట్టి రకం పత్తి క్వింటా రూ.7,121, పొడవు రకం క్వింటా రూ.7,521 మద్దతు ధర ప్రకటించామన్నారు. ఇంతకన్నా తక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. పండించిన పత్తిని బాగా అరబెట్టి 8 శాతం కన్నా ఎక్కువగా తేమ ఉండేలా, దుమ్ము, ధూళి లేకుండా బాగా శుభ్రపరిచిన పత్తిని తీసుకురావాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. రైతులు తమ ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్సులను రైతు సేవా కేంద్రాల అసిస్టెంట్లకు అందించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బాబుకు మంచి బుద్ధినివ్వు స్వామీ

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శ్రీవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

'స్వామీ ఆ పాపాత్ములను క్షమించు. తిరుమల ప్రాశస్త్యాన్ని దశదిశలా వ్యాప్తి చేయాల్సిన పదవుల్లో ఉంటూ స్వార్థ రాజకీయం చేస్తున్న వారిని మన్నించు. తిరుమల లడ్డూ పేరుతో నీచ రాజకీయం చేస్తున్న వారికి మంచి బుద్ధి ప్రసాదించు' అంటూ వైఎస్సార్ సీపీ నేతలు శనివారం జిల్లావ్యాప్తంగా శ్రీవారి ఆలయాల్లో పూజలు చేశారు. చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాలని మొక్కుకున్నారు. మత రాజకీయాలతో పబ్బం గడుపుకోవాలనుకునే వారిని ఆ దేవదేవుడే శిక్ష విధిస్తారని నేతలు వ్యాఖ్యానించారు.





అనంతపురంలోని శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ నేతలు, పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు
- కూటమి ప్రభుత్వ దుశ్చర్యలపై నేతల మండిపాటు
- రాజకీయాలకు శ్రీవారిని వాడుకోవడం దురదృష్టకరం: పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: అనంతపురంలోని రైల్వే ఫీడర్ రోడ్డులో ఉన్న శ్రీవారి ఆలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

- ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పెన్నోహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు, గజమాల సమర్పించి అభిషేకం నిర్వహించడంతో పాటు పూజలు చేశారు. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లేలా దుశ్చర్యలకు పాల్పడిన వారికి రానున్న రోజుల్లో ప్రజలే తప్పక బుద్ధి చెబుతారన్నారు.
- గుంతకల్లులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పూజలు చేశారు. 101 టెంకాయలు స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి పాల్గొన్నారు. గుత్తి శివాలయంలో పార్టీ కన్వీనర్లు పీరా, గోవర్ధన్ రెడ్డి పూజలు నిర్వహించారు.
- కళ్యాణదుర్గంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీల అమలుపై స్పష్టత ఇవ్వకుండా నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.
- శింగనమల మండలం నాయనవారిపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి పూజలు నిర్వహించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాలంటూ పూజలు నిర్వహించామన్నారు.
- రాయదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దుశ్చర్యలను దేవుడు క్షమించడన్నారు. కుట్రపూరితంగానే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల్లోనూ నాయకులు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజకీయాలకు శ్రీవారిని వాడుకుంటారా?

అనంతపురంలో శ్రీవారికి పూజల అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి లడ్డూ విశిష్టతకు, తిరుమల పవిత్రతకు కూటమి నేతలు భంగం కలిగించారన్నారు. చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు స్వామి వారి ఆగ్రహం రాష్ట్ర ప్రజలపై పడకూడదని ప్రార్థించామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్నాక అన్ని వ్యవస్థలనూ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. వంద రోజుల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారన్నారు. తమ పార్టీ అధినేత జగన్ తిరుమలకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించడం దుర్మార్గమన్నారు.



గుంతకల్లులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో టెంకాయలు కొడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



పెన్నహోబిలం నృసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి



కళ్యాణదుర్గం వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, నేతలు



రాయదుర్గం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



యాడికి చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న నాయకులు



ఆత్మకూరులోని ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



నాయనవారిపల్లిలో శ్రీవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

రూ. కోట్ల అప్పు.. ఉడాయింపు

- రూ. 5 కోట్ల అప్పు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిన టీచరు బద్రీనాథ్





బద్రీనాథ్ బాధితుల జాబితా (విద్యాశాఖకు సంబంధించిన వారు మాత్రమే)

అనంతపురం ఎడ్యుకేషన్: మరో టీచరు అప్పుల బాగోతం వెలుగులోకి వచ్చింది. మొన్న రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో బయాలజీ టీచరుగా పని చేస్తున్న రమేష్ కోట్లాది రూపాయలు అప్పులు చేసి ఉడాయించారు. నిన్న అనంతపురం ఆర్‌ఎం హెచ్‌ఎస్ స్కూల్‌లో తెలుగు టీచరు దివాకర్ నాయుడు చీటీలు, వడ్డీ పేరుతో రూ. 12 కోట్ల దాకా అప్పులు చేసి ఉడాయించారు. చివరకు కోర్టులో లొంగిపోవడంతో సబ్‌జైల్‌కు తరలించారు. తాజాగా రూ. 5 కోట్లకు పైగా అప్పులు చేసి అదృశ్యమైన మరో టీచరు బాగోతం వెలుగు చూసింది. విడపనకల్లు మండలం హావలిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం టీచరుగా పని చేస్తున్న కె.బద్రీనాథ్ కోట్లాది రూపాయలు అప్పులు చేశారు. బాధితుల్లో 60 మందికి పైగా విద్యాశాఖలో పని చేస్తున్న టీచర్లు, ఇతర ఉద్యోగులే ఉన్నారు. వీరి వద్దే రూ. 3.5 కోట్ల అప్పులు చేశారు. ఆయన పని చేస్తున్న పాఠశాలలోనే రూ. 25 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది. ఈయన దాదాపు రెండు నెలలుగా అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నమ్మకంగా ఉండటంతో తమ పిల్లల ఉన్నత చదువుల కోసం దాచుకున్న డబ్బును బద్రీనాథ్‌కు ఇచ్చామని కొందరు చెబుతుండగా, తమ పిల్లల పెళ్లిళ్ల కోసం దాచుకున్న సొమ్మును ఇచ్చామని మరికొందరు చెబుతున్నారు. చాలామంది బాధితులు వడ్డీకి ఆశపడి ఇచ్చారు.

రెండు నెలలుగా రావడం లేదు

గణితం టీచరు బద్రీనాథ్ దాదాపు రెండు నెలలుగా పాఠశాలకు రావడం లేదు. ఆయన ఎలాంటి అనుమతులు కూడా తీసుకోలేదు. మెడికల్ లీవ్‌లో ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. వీఆర్‌ఎస్ తీసుకుంటాడని మరికొందరు అంటున్నారు. ఆయనైతే నేరుగా నాకు అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.
– మధురవాణి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, హావలిగి

వివాదాస్పద తీరు.. ఆగడాల్లో సరిలేరు!

- అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌పై ఆరోపణలెన్నో..
- కందుకూరి శివారెడ్డి హత్య కేసులో నిందితులకు బాసట
- ప్రాణహాని ఉందని అప్పట్లో వారం ముందే వినతిపత్రం ఇచ్చిన బాధితులు
- అయినా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి హత్యకు పరోక్షంగా కారణమైన సీఐ
- ప్రసాదరెడ్డి హత్య సమయంలోనూ ఈయనపై విమర్శలు
- ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుపాటి అప్పట్లో రాప్తాడు ఎంపీపీ
- దీంతోనే ఏరికోరి ఇక్కడికి తెచ్చుకున్నారని విమర్శలు
- సెటిల్‌మెంట్లలోనూ దిట్ట అని రాజేంద్రనాథ్‌కు పేరు
- అలాంటి వ్యక్తిని అందలమెక్కించడంపై ప్రజల విస్మయం

ఎక్కడైనా ఒక పోలీసు అధికారికి మంచి పోస్టింగ్ ఇవ్వాలంటే పనితీరు, నిజాయితీ వంటివి చూస్తారు. కానీ ఆ సీఐకి ఈ అర్హతలే లేవు. పైపెచ్చు ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. హత్య కేసుల్లో నిందితులకు సహకరిస్తారని, బాధితులపైనే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తారనే విమర్శలు ఉన్నాయి. ల్యాండ్ సెటిల్‌మెంట్లు, రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తడంలో ఘనాపాటిగా పేరుంది. అలాంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరిచి మరీ అందలం ఎక్కించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గతంలో రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన రెండు హత్యలు రాష్ట్రంలోనే సంచలనం సృష్టించాయి. అనంతపురం రూరల్ మండలం కందుకూరులో 2018 మార్చి 30న వైఎస్సార్ సీపీ నేత శివారెడ్డి దారుణ హత్యకు గురయ్యారు.ఇటుకలపల్లి నుంచి స్వగ్రామం వెళ్తుండగా దారిలో కాపుకాచిన ప్రత్యర్థులు వేటకొడవళ్లతో అతి కిరాతకంగా ఆయనను నరికి చంపారు. ఈ హత్యకు వారం రోజుల ముందే రెండు వర్గాల నడుమ గొడవ జరిగింది. ఈ క్రమంలోనే శివారెడ్డి సోదరుడు తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ వినతిపత్రం అందించగా, అప్పట్లో సీఐగా ఉన్న రాజేంద్రనాథ్ యాదవ్ దాన్ని చెత్తబుట్టలో పడేశారు. ఆ తర్వాత వారం రోజులకే శివారెడ్డి హత్య జరిగింది. వినతిపత్రం ఇచ్చినప్పుడే నిందితులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి ఉంటే అసలు హత్యే జరిగి ఉండేది కాదని కందుకూరు గ్రామస్తులు నేటికీ చెబుతున్నారు. శివారెడ్డి హత్యకు పరోక్షంగా సీఐ కూడా కారణమంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచలనం సృష్టించిన ఈ హత్య కేసు విచారణ అధికారిగా రాజేంద్రనాథ్ ఉంటే బాధితులకు న్యాయం జరగదని మరో పోలీసు అధికారిని ఉన్నతాధికారులు నియమించడం గమనార్హం.

ప్రసాదరెడ్డి హత్య కేసులోనూ..

2015 ఏప్రిల్ 29న ఏకంగా రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలోనే వైఎస్సార్ సీపీ కీలక నేత భూమిరెడ్డి శివప్రసాద్ రెడ్డి హత్యకు గురయ్యారు. ఈ హత్య నేపథ్యంలోనూ రాజేంద్రనాథ్ వ్యవహార శైలిపై విమర్శలు వచ్చాయి. ప్రస్తుత అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కారును అప్పట్లో శివప్రసాద్ రెడ్డి హత్య కేసు నిందితులు వాడినట్టు తేలింది. ఆ సమయంలో దగ్గుపాటి ప్రసాద్ రాప్తాడు ఎంపీపీగా ఉన్నారు. ఇప్పుడు దగ్గుపాటి అనంతపురం ఎమ్మెల్యే కావడంతో రాజేంద్రనాథ్ ఏకంగా కీలకమైన వన్‌టౌన్‌కు పోస్టింగ్ తెచ్చుకోగలిగారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సీఐ రాజేంద్రనాథ్ యాదవ్

సెటిల్‌మెంట్లలో ఘనుడు!

రాప్తాడుకు చెందిన ఓ విలేకరికి, ఆయన అన్నదమ్ములకు మధ్య భూ వివాదం నడుస్తోంది. వీరిలో ఒక వర్గానికి పరిటాల కుటుంబం మద్దతు ఉంది. దీంతో అప్పట్లో మంత్రి అయిన పరిటాల సునీత ఒత్తిడితో విలేకరిపై సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ రెచ్చిపోయారు. విలేకరి చొక్కా పట్టుకుని 'భూమి మీద నీకు హక్కులేదు, మర్యాదగా వచ్చి సంతకాలు చేస్తావా లేదా' అని బెదిరించారు. దీంతో బాధిత విలేకరి అప్పట్లో తన మిత్రులతో కలిసి పోలీసుస్టేషన్ ముందు ధర్నాకు దిగగా సీఐ క్షమాపణలు చెప్పారు. ఇలా ల్యాండ్ సెటిల్‌మెంట్లలోనూ ఘనాపాటిగా రాజేంద్రనాథ్ యాదవ్ పేరు తెచ్చుకున్నారు.

తాజాగా స్టూడెంట్ యూనియన్ నేతలపై..

నేటికీ రాజేంద్రనాథ్ యాదవ్ తన వివాదాస్పద వైఖరిని వీడలేదు. స్టూడెంట్ యూనియన్ నాయకులపై ఇటీవల తీవ్రస్థాయిలో రెచ్చిపోయారు. స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలంటూ అనంతపురంలోని పెన్నార్ భవన్ వద్ద ధర్నాకు దిగిన ఏఐఎస్‌ఎఫ్ నేతలపై చిందులు తొక్కారు. సీఐ వాడిన భాష అత్యంత జుగుప్సాకరంగా ఉందని, తమను కొట్టడానికి కూడా యత్నించారని, విద్యార్థుల పట్ల కూడా అమానవీయంగా వ్యవహరించారని విద్యార్థి సంఘం నేతలు వాపోయారు. ఇలా తాను ఎక్కడ పనిచేసినా లెక్కలేనన్ని 'ఘనతలు' మూటగట్టుకున్న వ్యక్తికి నగరంలో కీలక స్థానాన్ని కట్టబెట్టడం ఉమ్మడి జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది. చిన్న తప్పు చేసినా పెద్ద శిక్ష వేసే పోలీసు బాస్‌లు రాజేంద్రనాథ్ యాదవ్ విషయంలో ఉదారంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

5లోపు ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన పూర్తి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ

అనంతపురం అర్బన్: జిల్లాలో ఫ్రీ హోల్డ్ అయిన 23,399.10 ఎకరాల భూమికి సంబంధించిన పరిశీలన ప్రక్రియను అక్టోబరు 5లోపు పూర్తి చేసి నివేదిక అందిస్తామని సీసీఎల్ఏ జయలక్ష్మికి కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. నిషేధిత భూముల (22ఏ) జాబితా నుంచి తొలగించిన భూముల రీ–వెరిఫికేషన్ ప్రక్రియపై సీసీఎల్ఏ శనివారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫ్రీహోల్డ్ అయిన తరువాత రిజిస్ట్రేషన్ జరిగిన 99.679 ఎకరాల భూమికి సంబంధించి పునఃపరిశీలన ప్రక్రియను అక్టోబరు 1వ తేదీలోగా పూర్తి చేసి నివేదిక అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ శివ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఉద్యోగుల భాగస్వామ్యం అభినందనీయం

సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉద్యోగులు భాగస్వాములు కావడం అభినందనీయమని కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షులు వి.వినోద్‌కుమార్ అన్నారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో రెడ్ క్రాస్ సభ్యులుగా చేరిన వారి సభ్యత్వానికి సంబంధించిన రూ.1,85,900 చెక్కును శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు అందుకున్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ మట్కా గుట్టు రట్టు



మాట్లాడుతున్న సీఐ జయనాయక్

రాయదుర్గం: ఆన్‌లైన్ మట్కా గుట్టును రాయదుర్గం పోలీసులు రట్టు చేశారు. ఆరుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ జయనాయక్ మీడియాకు వెల్లడించారు. రాయదుర్గం మండలం టీ వీరాపురానికి చెందిన మోడూరి సంజీవప్ప, అవులెన్న మహాత్మ, తలారి తిప్పేస్వామి, బోరు గుజ్జి అంపన్న, బోయ వడకల గోపాలక్రిష్ణ, బోయ రాజు అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరి నుంచి రూ.1.35 లక్షల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు ఆన్‌లైన్ జూదం నిర్వహిస్తున్నట్టు విచారణలో తేలింది. మట్కా గుట్టు రట్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీఐతో పాటు ఏఎస్‌ఐ భాస్కర్, సిబ్బంది సుంకన్న, సూర్యనారాయణను ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు అభినందించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు మైనర్లు

అనంతపురం: జల్సాల కోసం దొంగలుగా మారిన ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన ఇద్దరు మైనర్లు గంజాయి, మద్యం మత్తుకు అలవాటుపడ్డారు. తల్లిదండ్రుల పేరేపితం వల్ల బైక్‌లు, సెల్‌ఫోన్లతో పాటు ఇళ్లల్లో ఆభరణాల దొంగతనాలకు పాల్పడేవారు. దొంగిలించిన సొత్తును తల్లిదండ్రులకు ఇస్తే.. వారు నగదుగా మార్చి పిల్లలకు ఇచ్చేవారు. అలా మైనర్లు జల్సాలు తీర్చుకునేవారు. ఈ క్రమంలోనే అనంతపురంలోని చంద్రబాబు కొట్టాలలో ఓ ఫొటోస్టుడియో షట్టర్‌ను ఇనుపరాడ్లతో పగులగొట్టి అందులోని ఒక నైకాన్ డీ–810 కెమెరా, బ్యాటరీ, ఇతర సామగ్రిని దొంగిలించారు. పామిడిలో ఓ షాపు పగులగొట్టి సిగరెట్ ప్యాకెట్లు, ఎలక్ట్రిక్ స్టార్టర్ పెట్టె, నగదును అపహరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నిందితులను పట్టుకునేందుకు నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని, జువైనల్ జస్టిస్ బోర్డు ముందు శనివారం హాజరుపరిచారు. వీరి నుంచి 7 తులాల బంగారు కడ్డీ, నేరాలకు ఉపయోగించే రెండు ఇనుప రాడ్లు, టార్చిలైట్, ఒక పల్సర్ బైక్, ఒక ఐ ఫోన్, నైకాన్ డీ–810 కెమెరా, బ్యాటరీ, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6 లక్షలుగా నిర్ధారించారు. దొంగతనం కేసును ఛేదించిన సీఐ కె.సాయినాథ్, ఎస్‌ఐ రాంప్రసాద్‌లను ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

ఆస్పత్రి వద్దు.. బడికి వెళ్తానమ్మా..

- తలసేమియాతో బాధపడుతున్న విద్యార్థి
- శస్త్రచికిత్సకు రూ.18 లక్షలు అవసరమన్న వైద్య నిపుణులు
- చేతిలో చిల్లిగవ్వలేక సతమతమవుతున్న తల్లిదండ్రులు
- మందుల కొనుగోలుకూ తప్పని ఇబ్బంది
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్



చదువుకోవాలన్న తపనతో శ్రీకాంత్ తన పక్కనే ఉంచుకున్న తెలుగు పుస్తకం

గార్లదిన్నె: తన ఈడు పిల్లలతో కలసి బడికెళ్లాల్సిన ఓ చిన్నారి తలసేమియా వ్యాధి బారిన పడి ఆస్పత్రి పాలయ్యాడు. 'అమ్మా... ఈ ఆస్పత్రి వద్దు.. నేనూ బడికి పోతా'నంటూ ఆ చిన్నారి అమాయకంగా అడుగుతుంటే నిరుపేద తల్లిదండ్రుల కంట నీరు ఆగడం లేదు. చాపకింద నీరులా కబళిస్తున్న మృత్యువు బారి నుంచి తమ బిడ్డను దక్కించుకునేందుకు ఆ నిరుపేద తల్లిదండ్రులు పడుతున్న వేదన మాటల్లో వర్ణించలేం. తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టే ఆపన్న హస్తం కోసం వారు ఎదురు చూస్తున్నారు.

కూలికెళితేనే పూట గడుస్తుంది..

గార్లదిన్నె మండలం పాత కల్లూరులో నివాసముంటున్న సురేంద్ర, సుజాత దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఆదాయం అరకొరగా ఉన్నా... ఇద్దరు పిల్లలతో ఎంతో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న కుమారుడు శ్రీకాంత్ అరుదైన వ్యాధిబారిన పడి మృత్యువుతో పోరాడుతున్నాడు.

బ్యాంక్ వివరాలు...

ఖాతాదారు పేరు : కె.సుజాత
బ్యాంక్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కల్లూరు శాఖ, గార్లదిన్నె మండలం
ఖాతా నంబర్ : 3879 010 6265
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0002737
ఫోన్‌పే నంబర్లు : 90145 15056, 81067 51483

15 రోజులకోసారి రక్తమార్పిడి

ఏడేళ్ల వయసున్న శ్రీకాంత్... నెల రోజుల క్రితం జ్వరం బారిన పడడంతో సమీపంలోని పామిడిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో మరో ప్రైవేట్ వైద్యుడికి చూపించారు. వైద్య పరీక్షల అనంతరం చిన్నారిలో ఎర్ర రక్తకణాలు క్షీణిస్తున్న విషయాన్ని పసిగట్టిన సదరు వైద్యుడి సూచన మేరకు అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం క్షీణిస్తుండడంతో వైద్యులు వెంటనే రక్తం ఎక్కించారు. అయినా మార్పు కనిపించకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని హయ్యర్ ఇన్‌స్టిట్యూట్‌కు రెఫర్ చేశారు. అక్కడ పరీక్షించిన వైద్యులు... హైదరాబాద్ లేదా బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో నేరుగా బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం తలసేమియా వ్యాధితో శ్రీకాంత్ బాధపడుతున్నాడని వైద్యులు నిర్ధారించారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉండడంతో వెంటనే ఆపరేషన్ చేయాలని, ఇందుకు రూ.18 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఆపరేషన్ చేసే వరకూ ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. దీంతో కుమారుడి వద్ద తన భార్యను ఉంచి సురేంద్ర స్వగ్రామానికి చేరుకున్నాడు. కుటుంబపోషణ కోసం తన వద్ద ఉన్న రెండు గేదెలు అమ్మడంతో పాటు ఇతరుల వద్ద అప్పు చేసి కొంత డబ్బు సమకూర్చుకుని బెంగళూరుకు వెళ్లాడు. ఇప్పటి వరకూ వైద్యం కోసం దాదాపు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. చివరకు చేతిలో చిల్లిగవ్వ లేకుండా పోయింది. ఇన్‌పేషెంట్‌గా ఉంటే ఆస్పత్రి ఖర్చులు భరించలేని దుస్థితికి చేరుకోవడంతో అదే ఆస్పత్రి బయట ఓ గదిని అద్దెకు తీసుకుని రోజూ వెళ్లి చికిత్స చేయించుకుని వస్తున్నారు. ఈ క్రమంలో సురేంద్ర అక్కడే కూలి పనులకు వెళుతుండగా.... తల్లి సుజాత కుమారుడి బాగోగులు చూసుకుంటోంది.

బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి ...

రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తున్న కుమారుడి ప్రాణాలు దక్కించుకునేందుకు నిరుపేద తల్లిదండ్రులు మొక్కని దేవుడంటూ లేడు. రక్తం ఎక్కించాల్సిన ప్రతిసారీ రూ.20 వేలు ఖర్చు వస్తోంది. ప్రస్తుతం చేతిలో నయా పైసా లేదు. బెంగళూరులోనే సురేంద్ర కూలీ పనుల ద్వారా సంపాదిస్తున్న అరకొర డబ్బు రోజు వారి అవసరాలకు సరిపోతోంది. స్వశక్తితో కుమారుడికి నయం చేయించుకోవాలనుకున్న ఆ తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. ఇలాంటి పరిస్థితిలో తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టే ఆపన్న హస్తం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సాయం చేయాలని వేడుకుంటున్నారు.

'డీఈఓ అక్రమాలపై పారదర్శక విచారణ చేపట్టాలి'

అనంతపురం ఎడ్యుకేషన్: అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఈఓ (జిల్లా విద్యాశాఖ అధికారి) వరలక్ష్మిని సస్పెండ్ చేసి, పారదర్శకంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు రాశారు. ఈ మేరకు ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాస్ రావు, ముఖ్య సలహాదారు ఎం.బాలన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాగేంద్ర, గుత్తి ప్రేమనాథరెడ్డి, రమేష్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి శేష ఫణి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఈఓ అక్రమాలపై పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నాయని గుర్తు చేశారు. ప్రశ్నించిన వారిని వేధించడం, ఏదో ఒక నెపంతో సస్పెండ్ చేయడం ఆమె నైజంగా ఉందని విమర్శించారు. సమగ్రశిక్ష డీపీసీ హోదాలోనే క్లర్కులను రీ ప్యాట్రియేషన్ చేయాల్సి ఉండగా కలెక్టర్‌కు ఫైలు పెట్టి పక్కదోవ పట్టించారన్నారు. ఓపెన్ స్కూల్ విషయంలో విద్యార్థుల నుంచి నిర్ణీత ఫీజు కంటే అధిక మొత్తంలో వసూళ్లు చేశారని తెలిపారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. బెస్ట్ టీచర్ అవార్డుల ఎంపికలోనూ నిబంధనలకు తిలోదకాలిచ్చారని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: అక్టోబర్ 5న 'వరల్డ్ టీచర్స్ డే' సందర్భంగా భారతీయ సంస్కృతిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న గురువుల కృషిని గుర్తిస్తూ వారికి జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయిలో వేర్వేరుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలనందించనున్నట్లు 'ఆల్ ది బెస్టు అకాడమీ' సాంస్కృతిక, సాహిత్య సంస్థ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యారంగమే కాకుండా వివిధ రంగాలలో గురువులుగా రాణిస్తున్న వారు అవార్డులకు అర్హులని, వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్‌నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామా చేరేవిధంగా పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయిపోటీలకు గురుకుల విద్యార్థిని



ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

బుక్కరాయసముద్రం: కొర్రపాడు వద్దనున్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న లహరి జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో లహరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైందని వివరించారు. అక్టోబర్–4, 5 తేదీల్లో హైదరాబాద్ యూసఫ్‌గూడ కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగే 24వ జూనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా లహరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, సరళ, పీఈటీలు వరలక్ష్మి, తేజేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు తావివ్వొద్దు



సమావేశం నిర్వహిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అర్బన్: రేషన్ పంపిణీలో అక్రమాలకు తావివ్వరాదని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పౌర సరఫరాలకు సంబంధించి జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారులకు నిత్యావసరసర సరుకులు, బియ్యం సక్రమంగా పంపిణీ జరగాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు లేని చోట కొత్త ఆపరేటర్లను నియమించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, ఐసీడీఎస్ కోటాను ఎండీయూల ద్వారా పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు చేరవేయాలని ఆదేశించారు. సీఎస్‌డీటీలు తమ పరిధిలోని చౌక ధరల దుకాణాలను, ఎండీయూలను తనిఖీ చేస్తూ కార్డుదారులకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలన్నారు. ప్రతి మండలంలో కనీసం 90 శాతానికి తగ్గకుండా పంపిణీ జరగాలన్నారు. అనంతరం పౌర సరఫరాలకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి టి.ఎస్.శోభరాణి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తూనికలు, కొలతల శాఖ అధికారులు, ఏఎస్ఓలు, సీఎస్‌డీటీలు, డీలర్ల సంఘం, ఎండీయూ ఆపరేటర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నేతల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తుల కోసం పనిచేస్తోందని కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఎందరో త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడం కార్మికులకు తీవ్ర ద్రోహం చేయడమేనని అన్నారు. ప్రైవేటీకరణ చర్యను తక్షణం నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలనే అంశంపై శనివారం అనంతపురంలోని జేవీవీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి నాగవేణి మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణలో కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వెళుతున్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుండడం శోచనీయమన్నారు. తొలి నుంచి కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులకు తీవ్ర నష్టం కలిగించిందని గుర్తు చేశారు. అదే క్రమంలో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చేసి కార్మికుల పొట్ట గొట్టేందుకు సిద్ధపడిందన్నారు. ప్రైవేటీకరణ చర్యలు ఆపకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నాగరాజు, చిరంజీవి, వెంకటనారాయణ, హనుమంత రాయుడు, కళ్లాయిస్వామి, నరేష్, సురేష్, శంకర్, వీరేంద్ర, రాజు పాల్గొన్నారు.

పోరాట సమన్వయ సమితి కమిటీ


విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలుపుదలకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించడంతో పాటు పోరాట సమన్వయ సమితి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. విశాఖ ఉక్కు పోరాట సమన్వయ సమితి జిల్లా కమిటీ కన్వీనర్‌గా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడి, కో– కన్వీనర్లుగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం ఎన్నికయ్యారు. సభ్యులుగా కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, రైతు కూలీ, ప్రజా సంఘాల నాయకులు మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, రాజేష్, వెంకటనారాయణ, సురేష్, చంద్రశేఖర్, శేఖర్, కుళ్లాయిస్వామి, పరమేష్, నరేష్, వీరేంద్ర, సంతోష్, బాలకృష్ణ, హరిణి, వేమన, సూర్యనారాయణ, కృష్ణను ఎన్నుకున్నారు. అక్టోబరు ఒకటవ తేదీన విద్యార్థి, యువజన సంఘాలు, రెండో తేదీన కార్మిక సంఘాలు, మూడో తేదీన రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు.

విస్తృతస్థాయిలో స్వచ్ఛతా హీ సేవ

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా విస్తృతస్థాయిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవ, పింఛన్ల పంపిణీ అంశాలపై కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారుల భాగస్వామ్యం వందశాతం ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శుల జాబితా తయారు చేసుకోవాలని చెప్పారు. వారికి జాకెట్, క్యాప్ అందించాలన్నారు. మండలాల్లో 10 ప్రాంతాలు, మునిసిపాలిటీల్లో 20 ప్రాంతాలను క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్స్‌ను గుర్తించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న నిధులతో అవసరమైన పరికరాల కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ–వేస్ట్ పాలసీ ప్రకారం ఈ–వేస్ట్ ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండల, మునిసిపల్, పీహెచ్‌సీల స్థాయిలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ : పింఛన్ల పంపిణీ ప్రక్రియను అక్టోబరు ఒకటో తేదీన పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పింఛను సొమ్మును ముందుగానే డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆ రోజు ఉదయం ఆరు గంటలకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎల్‌డీఎం, ఏపీఎంలు, మునిసిపల్ కమిషనర్లు, క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి



గర్భిణులకు సూచనలిస్తున్న పీడీ శ్రీదేవి

బుక్కరాయసముద్రం: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని రేకలకుంట, రెడ్డిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తున్న సరుకుల, పౌష్టిక ఆహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తల్లీబిడ్డ సంరక్షణ, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించాలన్నారు. మాతా శిశు మరణాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రక్త హీనత నివారణకు పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమా శంకరమ్మ, సూపర్‌వైజర్ నాగవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ బీఈడీ కళాశాలలో అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 30న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ సైన్సెస్ (మెథడాలజీ) అకడమిక్ కన్సల్టెంట్ పోస్టు భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెస్సీ (ఫిజిక్స్), ఎంఈడీ, పీహెచ్‌డీ లేదా నెట్/సెట్ (పెడగాగి సబ్జెక్టు లేదా ఎడ్యుకేషన్), బీఈడీ (ఫిజికల్ సైన్సెస్ మెథడాలజీ) అర్హత గల వారు ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వేరుశనగ, కంది పంటలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్



ఎండిన వేరుశనగ పంటను చూపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

రాప్తాడు: ప్రస్తుత ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. రాప్తాడులో రైతు పామాల కొండప్ప ఏడు ఎకరాల్లో సాగు చేసిన పంటను ఆయన పరిశీలించారు. పంట ఎండుముఖం పట్టడంతో కారణాలపై ఆరా తీశారు. పంట సాగు చేసి రెండు నెలలైనా పదునైన వర్షం పడలేదని రైతు తెలిపాడు. పంట దక్కకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన పంటగా వేరుశనగ ఏటా 8 లక్షల హెక్టార్లలో సాగవుతోందన్నారు. అయితే ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. ప్రస్తుతం వర్షం వచ్చినా పంట దక్కే పరిస్థితులు లేవన్నారు. చెట్టుకు ఒకటి, రెండు కాయలు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ అస్తవ్యస్తంగా సాగుతోందని, పంట దిగుబడిని పరిశీలించే పరిస్థితిలో అధికారులు లేరని, సాగు సలహాలు, సూచనలు ఇవ్వడంలో కానీ, పంటలు దెబ్బతిన్నపుడు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చి ఆదుకునే విషయంలో కానీ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. వేరుశనగ సాగుకు ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల దాకా పెట్టుబడి పెడితే.. ఇప్పుడు దిగుబడి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఏటేటా పంటలు నష్టపోయి రైతులు అప్పులపాలవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేరుశనగతో పాటు కంది పంటకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం వచ్చే వారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి పోతులయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజినేయులు, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కదిరప్ప, రైతులు సుబ్బిరెడ్డి, వెంకట్రాముడు, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వీఆర్ఏ అరెస్ట్

పుట్లూరు: పోక్సో కేసులో వీఆర్ఏ తిరుపాలు అరెస్టయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మైనర్‌పై అత్యాచారయత్నం చేసిన తిరుపాలుపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. నిందితుడిని శనివారం తాడిపత్రి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి అక్టోబర్ పది వరకు రిమాండ్ విధించారు.

శనగలగూడూరులో భారీ బందోబస్తు

శనగలగూడూరులో మైనర్ బాలికపై వీఆర్ఏ తిరుపాలు అత్యాచారయత్నం చేసిన ఘటనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 160 మంది పోలీసు సిబ్బందితో శనివారం భారీ బందోబస్తు చేపట్టారు. గ్రామంలో కవాతు నిర్వహించి ఘర్షణలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐ ఇంట్లో చోరీ

రాప్తాడురూరల్: రిటైర్డ్ ఏఎస్ఐ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు గణేష్‌నగర్‌లో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్ఐ వీరాంజనేయులు తన కుటుంబంతో ఈ నెల 25న షిర్డీకి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. తలుపు తీసి లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.50 వేలు విలువ చేసే డైమండ్ నెక్లెస్, రూ.8 వేలు విలువ చేసే డైమండ్ రింగ్, 12 గ్రాముల బంగారు చైనును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో ఉదయాన్నే సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ రాంబాబు సిబ్బందితో వెళ్లి ఇంటిని పరిశీలించారు. కొత్త తరహా దొంగతనం జరగడం పోలీసులను ఆశ్చర్యపరిచింది. ఇంటి ప్రధాన డోరును ఏమాత్రం ముట్టుకోలేదు. బాత్రూం కిటికీని తొలగించి అందులోంచి ఇంటిలోకి ప్రవేశించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబూ.. డ్రామాలు ఆపు

- లడ్డూపై విషప్రచారం చేయడం దుర్మార్గం
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



రాప్తాడు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయించిన నాయకులు

అనంతపురం కార్పొరేషన్: అత్యంత విశిష్టత కలిగిన తిరుమల శ్రీవారి లడ్డూపై సీఎం చంద్రబాబు నాయుడు దుష్ప్రచారం చేయడం దుర్మార్గం. రాష్ట్రంలో మతకలహాలు సృష్టించేలా వ్యవహరించడం బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని రైల్వే ఫీడర్ రోడ్డు వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి, అభిషేకం, అర్చన చేశారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు 14 ఏళ్ల జీవితమంతా కుట్రపూరితమే అన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా డ్రామాలు ఆపాలని హితవు పలికారు. స్వార్థ రాజకీయాల కోసం కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామినే వాడుకున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల పర్యటనకు వెళ్తుంటే అడ్డంకులు సృష్టించారన్నారు. ఇందులో జనసేన, బీజేపీ భాగస్వామ్యులు కావడం దురదృష్టకరమన్నారు. డిక్లరేషన్ పేరుతో కుట్రలు చేశారని మండిపడ్డారు. వైఎస్ జగన్ సీఎం కాకముందు సీఎం అయ్యాక కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారని గుర్తు చేశారు. వేంకటేశ్వర స్వామి ఆశీర్వాదాలు ఉండటంతో తండ్రీకొడుకులైన వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బ్రహ్మోత్సవాల వేళ పట్టు వస్త్రాలు సమర్పించే భాగ్యం కలిగిందన్నారు. రాష్ట్రంలో వంద రోజుల పాలన పూర్తిగా వైఫల్యం చెందిందని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ ముఖ్య నేతలు, నాయకులు జ్వాలాపురం శ్రీకాంత్, మీసాల రంగన్న, మహాలక్ష్మి శ్రీనివాసులు, రమేష్‌గౌడ్, చవ్వా రాజశేఖర్ రెడ్డి, కేవీ రమణ, మాల్యవంతం మంజుల, పెన్నోబులేసు, పామిడి వీరాంజనేయులు, కృష్ణమూర్తి, వెన్నం శివరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, సాకే కుళ్లాయస్వామి, రాధాకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, వనరాస బలరాం, రామయ్య, జాహ్నవి, శోభాబాయి, భారతి, దేవి, అంకిరెడ్డి ప్రమీళ, సుజాతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కోన వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కందుకూరు ఆంజనేయస్వామి ఆలయంలో..

చంద్రబాబుకు బుద్ధి ప్రసాదించాలి..

ఆత్మకూరు: పవిత్రమైన తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని విష ప్రచారం చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం రాత్రి ఆత్మకూరులోని ఆంజనేయ స్వామి ఆలయంలో చంద్రబాబుకు బుద్ధి ప్రసాదించాలని పూజలు చేయించారు. అలాగే వడ్డుపల్లిలోని సీతారాముల ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, సర్పంచులు వరలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద కొండారెడ్డి, ఈశ్వరరెడ్డి, పార్వతమ్మ, విశ్వనాథ్ రెడ్డి, మంజుల, రామాంజినమ్మ, కుమారి, వెంకట్రామిరెడ్డి, శ్రీరామ్, నరసింహులు, ఓబీ టైలర్ వెంకటేష్, గంగాధర్, నరేంద్ర, ఉజ్జినప్ప,రామకృష్ణ, అక్కులన్న తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఆంజనేయ స్వామి గుడిలో..

రాప్తాడు రూరల్: తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రంగా ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అనంతపురం రూరల్ మండలం కందుకూరు ఆంజనేయ స్వామి గుడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా శ్రీవారిని తమ స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. భక్తుల మనోభావాలను గాలికొదిలేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యులు శారదా, రాగే రేవతి పెద్దప్ప, నాయకులు నరసింహారెడ్డి, లింగమయ్య, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లి మండలంలోని కోన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్ జగన్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు నీరుగంటి నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లప్ప గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడులో..

రాప్తాడు: స్థానిక లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు చేయించారు. తిరుమల పవిత్రత, లడ్డూను అపవిత్రం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పాపాలను ప్రక్షాళన చేయాలని దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు మారక సుబ్బారెడ్డి, చిరుతల నాగేంద్ర, కొండా రెడ్డి, మన్నల రవి, చిరుతల నాగేంద్ర, డొక్కా రామచంద్ర, బుల్లే రామకృష్ణ, రామకృష్ణ, రామలింగమయ్య, బాబయ్య, బుడగ పెద్ద లింగమయ్య, రామలింగమయ్య, సాకే చంద్ర, కుమ్మర రాము పాల్గొన్నారు.

రాప్తాడు డిప్యూటీ తహసీల్దార్‌గా చెన్నకేశవులు

రాప్తాడు: రాప్తాడు నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.బి.చెన్నకేశవులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై రాప్తాడు మండల డీటీగా నియామకమయ్యారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న లక్ష్మీ నరసింహులును కంబదూరు మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు రైతుల సమస్యలు పరిష్కరిస్తూ మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకొస్తామని తెలిపారు.

క్లుప్తంగా

2 నుంచి దసరా ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: స్థానిక పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అక్టోబర్ 2 నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. శనివారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం నేతృత్వంలో జరిగిన సమావేశంలో సత్యనారాయణ, చల్లా కృష్ణరంగయ్య, గర్జాల నాగరాజు, వెంకటకృష్ణ, మంజునాథ్ తదితరులు దసరా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అశోక్ కుమార్, సత్యనారాయణ గుప్తా, కిషోర్, నాగేంద్ర, ప్రసాద్, బాలాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈనెల 27వ తేదీన ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి ట్రిపుల్ జంప్‌లో ప్రతాప్‌రెడ్డి ప్రథమ స్థానం, డిస్క్‌త్రోలో వెన్నెల ప్రథమ స్థానం, 3 కి.మీ నడకలో వర్షిత ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వీరు త్వరలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. సత్తా చాటిన విద్యార్థులను ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, గ్రామస్తులు అభినందించారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు

అనంతపురం: ఉద్యోగం చేయడం కంటే పది మందికి ఉపాధి కల్పించే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే-2024 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 78 సంవత్సరాల ఘన చరిత్ర గల కళాశాలలో చదువుకోవడం అదృష్టంగా భావించాలన్నారు. ఇక్కడ చదువుతున్న సీనియర్లు, జూనియర్లు అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసి మెలిసి చదువుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, సదస్సు కోఆర్డినేటర్ మంజుల పాల్గొన్నారు.

రేపు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం రూరల్: ఈ నెల 30న అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ విజయలక్ష్మి తెలిపారు.

జాషువా జీవితం ఆదర్శప్రాయం



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం



గబ్బిలం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాషువా సాహిత్య పీఠం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: సమాజంలో మార్పు కోసం పరితపించిన మహాకవి జాషువా జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలన్నారు. గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్ట్స్ కాలేజీలో జరిగిన జాషువా సాహితీ సదస్సుకు ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య నేతృత్వంలో జరిగిన సమావేశంలో డాక్టర్ ఆశావాది శశాంక మౌళి, ఎల్కేపీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, డాక్టర్ అంకె శ్రీనివాస్, డాక్టర్ అంకె రామలింగమయ్య తదితరులు మాట్లాడారు. కాలంతో పాటూ నిలబడిన మహాకవి తెలుగు వారి గుండె చప్పుడుగా వక్తలు అభివర్ణించారు. అంతకు ముందు జాషువా రచించిన గబ్బిలం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే కళాశాల ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటూ ఆర్టీటీ తిప్పేస్వామి, పెద్దన్న గౌడ్, డాక్టర్ నానీల నాగేంద్ర, రియాజుద్దీన్, పూజారి ఈరన్న, నాగభూషణం, డాక్టర్ జూటూరు షరీఫ్, టీవీరెడ్డి, పలువురు రచయితలు, కవులు నివాళులర్పించారు.

భగత్‌సింగ్, గుర్రం జాషువాకు నివాళి

అనంతపురం కార్పొరేషన్: బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి భగత్‌సింగ్ అని మేయర్ వసీం అన్నారు. శనివారం నగరంలో ఉన్న భగత్ సింగ్, జాషువా విగ్రహాలకు నివాళులర్పించారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ భారత యువత గుండెల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. బ్రిటీష్ వారి వెన్నులో వణుకు పుట్టించాడని కొనియాడారు. చిన్న వయస్సులో ప్రాణాలను దేశం కోసం త్యాగం చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, రహంతుల్లా పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

అనంతపురం అర్బన్: విప్లవ జ్యోతి భగత్ సింగ్ స్ఫూర్తితో యువత, విద్యార్థి సమస్యలపై పోరాటాలు సాగించాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 117వ జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక టవర్‌క్లాక వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సంఘాల నాయకలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. ప్రతి కార్యకర్త పోరాటాలు చేయాలన్నారు. సంఘాల అధ్యక్షులు ఆనంద్‌కుమార్, హనుమంత రాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు సంతోష్‌కుమార్, కుళ్లాయిస్వామి, నాయకులు మోహన్‌కృష్ణ, ధనుంజయ, వంశీచందు, మంజూనాథ్, ఉమామహేష్, చాంద్, శ్రీనివాస్, రాజశేఖర్, సురేంద్ర, అభినవ్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఐటీలో ఫ్రెషర్స్ డే



విద్యార్థులకు బహుమతులు అందజేసిన కళాశాల ఎండీ రమాకాంత్ రెడ్డి

రాప్తాడు: హంపాపురం సమీపంలోని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ అధ్యక్షతన 'ఫ్రెషర్స్ డే' (ఆరంభ్-2కే24) నిర్వహించారు. ఎస్వీఐటీ కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదీ కష్టం కాదన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు యువతలో ఉత్సాహన్ని రెట్టింపు చేశాయి. విద్యార్థులు డ్యాన్స్‌లతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ, చైర్మన్ క్రిష్టా రెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఏటీవీ వెంకట శివా రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ మదుసూధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

రాప్తాడు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. **విజేతలు వీరే:** ఖోఖో బాలురు అండర్-14 విభాగంలో రాప్తాడు మండలం ప్రథమ స్థానం, అనంతపురం రూరల్ మండలం ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో రాప్తాడు మండలం ప్రథమ స్థానం, ఆత్మకూరు మండలం ద్వితీయ స్థానం. ఖోఖో బాలురు అండర్-17 విభాగంలో ప్రథమ స్థానం రాప్తాడు, అనంతపురం రూరల్ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానం, అనంతపురం రూరల్ ద్వితీయ స్థానం. వాలీబాల్ బాలురు అండర్-14 విభాగంలో అనంతపురం రూరల్ ప్రథమ స్థానం, ఆత్మకూరు ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానం, ఆత్మకూరు ద్వితీయ స్థానం, బాలురు అండర్-17 విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానం, అనంతపురం రూరల్ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానం దక్కించుకుంది. అనంతపురం రూరల్ ద్వితీయ స్థానం. కబడ్డీ బాలుర విభాగంలో అండర్-14 విభాగంలో ఆత్మకూరు ప్రథమ స్థానం, రాప్తాడు ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో ఆత్మకూరు ప్రథమ స్థానం, రాప్తాడు ద్వితీయ స్థానం, బాలురు అండర్-17 విభాగంలో ఆత్మకూరు ప్రథమ స్థానం, అనంతపురం రూరల్ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానం, అనంతపురం రూరల్ ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో పీడీలు, ఎస్జీఎఫ్ మండల కన్వీనర్లు ఎన్.కేశవ మూర్తి, బి.రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సూర్యనారాయణ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు తైక్వాండో పోటీల్లో వివిధ పతకాలు సాధించారు. ఇటీవల తాడిప్రతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అండర్-50, అండర్-45 కేజీల విభాగాల్లో సత్తా చాటారు. 9వ తరగతి విద్యార్థులు ఎస్.అర్షియ, కే.హేమంత్, 8వ తరగతి విద్యార్థి కె.చరణ్ ప్రతిభ చాటి స్వర్ణ పతకాలు సాధించారని కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్ ఎ.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఎన్నికపై హర్షం

అనంతపురం ఎడ్యుకేషన్: ఏజీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు ఎన్నికపై జిల్లా ఆప్టా కార్యవర్గం హర్షం ప్రకటించింది. శనివారం విజయవాడలో జరిగిన ఏపీ జేఏసీ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికలో కాకి ప్రకాష్ రావు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారని ఆప్టా జిల్లా అధ్యక్షుడు కె. గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వెంకటరత్నం, కోశాధికారి బీఏ శంకరమూర్తి తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అనంతపురం కార్పొరేషన్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఎంపికైన లబ్ధిదారులకు వచ్చే ఏడాది మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో మన ఇళ్లు-మన గౌరవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నగరపాలక సంస్థ పరిధిలో స్థలం ఉండి, ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ శాఖ ఇటుకలు, సిమెంట్, ఐరన్, తదితర సామగ్రి అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో స్పోర్ట్స్ మీట్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శనివారం 'స్పోర్ట్స్ మీట్' ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి ఒలింపిక్ జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమన్నారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ విశ్వనాథ్, డీన్లు రిషిబాల, ముత్యాలన్న, సతీష్ కుమార్, కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ నాయుడు, పీఈటీలు రవిరాజ్, విజయ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొప్పర్తి పార్క్ తరలించడం దారుణం

అనంతపురం కార్పొరేషన్: కడపకు మంజూరైన కొప్పర్తి పార్క్‌ను అమరావతికి తరలించడం దారుణమని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ మంజునాథ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. కానీ సీఎం చంద్రబాబు స్వార్థ రాజకీయాలతో పార్క్‌ను తరలించారని ధ్వజమెత్తారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో బుద్ధి చెబుతారన్నారు.

జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా పోలీసు సిబ్బంది శనివారం వాహనాల తనిఖీలు, అక్రమ మద్యం , ఇసుక , గంజాయి, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై దాడులు చేపట్టారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై ట్రిపుల్ రైడింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులకు జరిమానా విధించారు.

జిల్లాకు 1,300 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు జిల్లాకు ఎరువులు సరఫరా అవుతున్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. శనివారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులను ఆయన పరిశీలించారు. ఫ్యాక్ట్ కంపెనీ నుంచి 1,300 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. అందులో అమ్మోనియం సల్ఫేట్ 670 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు 630 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయడంతో పాటు మిగతావి కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు వెల్లడించారు.

వర్చువల్ ఇంటర్న్‌షిప్ ర్యాంకింగ్స్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న చక్రధర రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక ఎడ్యు స్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్ ర్యాంకింగ్స్-2024లో ఎడ్యు స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రోగ్రాంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలకు ఆలిండియా 5వ ర్యాంక్ లభించింది. ప్రశంసాపత్రాన్ని ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి చేతుల మీదుగా కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి రెండు రోజుల క్రితం అందుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.